నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శుక్రవారం 12 జూలై 2024 | KHAMMAM

ఆదర్శ కళాశాలగా నిర్మాణం జరగాలి..

ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

రఘునాథపాలెం, జూలై 11 : భవిష్యత్ తరాలు చెప్పుకునే విధంగా ఆదర్శ కళాశాలగా మెడికల్ కాలేజీ భవన నిర్మాణాలు ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం అర్బన్ పరిధి బాలప్పేట శివారులో బైపాస్ రోడ్డుకు ఆనుకొని 40 ఎకరాల్లో మెడికల్ కళాశాల నిర్మించనున్న స్థలాన్ని కలెక్టర్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల నిర్మాణానికి కేటాయించిన భూమికి సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. భవనాలు, ప్రహరీ నిర్మాణాలు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. కాగా.. స్థలం మొత్తాన్ని కలియతిరిగి భవన నిర్మాణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, ఆర్అండ్బీ ఏఈ హేమలత, ఆర్డీవో గణేశ్, సర్వే ఏడీ శ్రీనివాసులు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సీహెచ్.స్వామి, రఘునాథపాలెం తహసీల్దార్ లూథర్ విల్సన్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కేయూ పాలకమండలిలో జిల్లాకు మొండిచేయి

- కేయూలో అత్యధిక ప్రైవేట్ కళాశాలలున్నది ఉమ్మడి ఖమ్మంలోనే..
- ముగ్గురు మంత్రులున్నా దక్కని ప్రాతినిధ్యం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మేధావులు, విద్యావేత్తలు

ఖమ్మం, జూలై 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): చైతన్యవంతమైన జిల్లా అంటే తక్కున గుర్తుకొచ్చేది ఖమ్మం జిల్లానే. ఎడ్యుకేషన్ హబ్‌గా కూడా జిల్లా పేరుగాంచింది. జిల్లాలో అనేకమంది మేధావులు, విద్యావేత్తలు పరిపుష్టంగా ఉన్నప్పటికీ జిల్లాను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించిన పాపానపోలేదు. ఇటీవల నియమించిన కాకతీయ యూనివర్సిటీ పాలకమండలిలో జిల్లా నుంచి ఒకరిద్దరికి కూడా చోటు కల్పించదు. 'ఖమ్మం జిల్లా కాకతీయ యూనివర్సిటీ పరిధిలోనే ఉందా? జిల్లాలో మేధావులు, అర్హులే లేరా? ముగ్గురు కీలక మంత్రులు ఉండి కూడా జిల్లాకు ప్రాతినిధ్యం లేకపోవడం ఏమిటి?' అంటూ మేధావులు, విద్యావేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ప్రతి పాలకమండలిలో ప్రాతినిధ్యం

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో అనుబంధ గుర్తింపు ఉన్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు అత్యధికంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఉన్నాయి. యూనివర్సిటీకి అందించే రెవెన్యూ కూడా జిల్లా నుంచే అధిక మొత్తంలో వెళ్తోంది. కేయూ పరిధిలో 410 డిగ్రీ, 80 పీజీ కళాశాలలుండగా వీటిలో 21 పీజీ కళాశాలలు, 114 డిగ్రీ కళాశాలలు ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోనే ఉన్నాయి. గతంలో నియమించిన ప్రతి పాలకమండలిలోనూ ఖమ్మం జిల్లాకు ప్రాతినిధ్యం ఉంది. గత ఐదు, ఆరు పాలకమండళ్లలో సత్తుపల్లికి చెందిన కొత్తురు ప్రభాకర్‌రావు, తర్వాత బీఈడీ కళాశాలకు చెందిన డాక్టర్ మువ్వా శ్రీనివాసరావు, కవిత విద్యాసంస్థలకు చెందిన కోటా అప్పిరెడ్డి, గత ప్రభుత్వం నియమించిన పాలకమండలిలో ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ రావూరి సీతారామారావు సభ్యులుగా ఉన్నారు. వీరంతా ఎడ్యుకేషనలిస్ట్ కోటా, ఇనిస్టిట్యూషన్స్ కోటా, లెక్చరర్స్ కోటా కింద సభ్యులుగా నియామకమయ్యారు.

జిల్లాలో అర్హులే లేరా?

కాకతీయ యూనివర్సిటీ పాలకమండలిలో 9 మంది సభ్యులు ఉంటారు. యూనివర్సిటీలో నుంచి ఇద్దరిని, లెక్చరర్స్‌లో నుంచి ఇద్దరిని, ప్రిన్సిపాల్స్ కేటగిరీ నుంచి ఇద్దరిని, ఎమినెంట్ పర్సనాలిటీ నుంచి నలుగురిని పాలకమండలిలో ఎంపిక చేయాలి. కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ కలిగిన కళాశాల. న్యాక్ ఏప్లస్‌ప్లస్ వచ్చిన ఏకైక కళాశాల. ప్రిన్సిపాల్‌ని లేదా లెక్చరర్‌ని ఏదో ఒక కేటగిరీలో ఎంపిక చేయాలి. కానీ కళాశాలకు ప్రాతినిధ్యం కల్పించలేదు. పాలకమండలిలో తప్పనిసరిగా ఇండస్ట్రియలిస్ట్, ఎడ్యుకేషనలిస్ట్ కోటాల నుంచి జిల్లాలో ఎవరో ఒకరిని మొదటి నుంచి నియమిస్తున్నారు.

మంత్రులు పవర్‌ఫుల్.. ప్రాతినిధ్యం నిల్..

జిల్లాలో ముగ్గురు పవర్‌ఫుల్ మంత్రులుండి కూడా జిల్లాకు ప్రాతినిధ్యం లేదు. కేయూ ఈసీలో ఎంపికైన వాళ్లంతా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వారే. ఖమ్మం జిల్లాకు కనీస ప్రాతినిధ్యం కూడా లేదు. 'కాకతీయ యూనివర్సిటీ వివాదాలకు నిలయంగా మారింది. సరైన పాలకమండలి లేకపోతే సమస్యలతో మరింత భ్రష్టుపట్టిపోయే అవకాశం ఉంది. ఖమ్మం జిల్లాకు ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం దుర్మార్గం.. ప్రైవేట్ విద్యాసంస్థలను పరిగణనలోకి తీసుకోకపోవడం దారుణం. ఒక యూనివర్సిటీ పాలకమండలిలో అత్యధిక కళాశాలలున్నప్పటికీ జిల్లాకు కనీసం ప్రాతినిధ్యం లేకపోవడం, కనీస గుర్తింపు ఇవ్వకపోవడం శోచనీయం. అర్హతలేని వారిని సభ్యులుగా నియమించి పాలకమండలి ఏర్పాటు చేశారు.' అంటూ గ్రాడ్యుయేట్ సంఘాల నేలు, విద్యావేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రులు భట్టి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించి పాలకమండలిని రద్దు చేసి ఖమ్మం జిల్లాకు ప్రాతినిధ్యం దక్కేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు
సాయంత్రం వరకు రిజిస్ట్రేషన్‌దారుల పడిగాపులు
రూ.1.50 కోట్ల ఆదాయం కోల్పోయిన రిజిస్ట్రేషన్ల శాఖ

రిజిస్ట్రార్ కార్యాలయాల్లో.. ఆధార్ సర్వర్ డౌన్

ఖమ్మం, జూలై 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉన్న ఆధార్ సర్వర్లు గురువారం ఒక్కసారిగా నిలిచిపోవడంతో రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి వచ్చిన వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉన్న ఆధార్ సర్వర్ల ద్వారా.. రిజిస్ట్రేషన్ చేయించుకునే వారికి, చేసే వారికి సాక్షుల వేలిముద్రలను బయోమెట్రిక్ విధానం ద్వారా సేకరించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపడతారు. అయితే గురువారం ఉదయం 10 గంటలకు కార్యాలయాలకు వచ్చి సబ్ రిజిస్ట్రార్లు ఆధార్ సర్వర్లను ఓపెన్ చేయగా కొద్దిసేపు పనిచేశాయి. అయితే రిజిస్ట్రేషన్లు మాత్రం మొదటి గంటలో ఏమీ కాలేదు. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పనిచేసే ఈ సర్వర్లు రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కసారిగా మొరాయించాయి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్వర్లు పని చేయకపోవడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాయాల్లో రిజిస్ట్రేషన్ లావాదేవీలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, ఖమ్మం రూరల్, వైరా, కూసుమంచి, మధిర, సత్తుపల్లి, కల్లూరుల్లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సర్వర్లు నిలిచిపోవడంతో రిజిస్ట్రేషన్లేమీ కాలేదు. అలాగే భద్రాద్రి జిల్లాలోని ఇల్లెందు, కొత్తగూడెం, భద్రాచలం, బూర్గంపహాడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ లావాదేవీలు స్తంభించాయి. దీంతో వందలాది మంది సర్వర్ పనిచేస్తుందన్న ఆశతో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోనే పడిగాపులు కాశారు. అయినా ఫలితం లేకపోవడంతో చివరికి సాయంత్రం వెనుదిరిగారు. సర్వర్‌లో వచ్చిన సాంకేతిక లోపం ఏమిటో అధికారులు వివరించకపోవడం, ఎప్పుడు పనిచేస్తుందో స్పష్టత ఇవ్వకపోవడం వంటి కారణాలతో వివిధ రకాల రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన రిజిస్ట్రేషన్‌దారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజూ 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి 250 రిజిస్రేషన్లు జరుగుతుంటాయి. ఈ రిజిస్ట్రేషన్ల వల్ల ప్రభుత్వానికి స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ చార్జీల రూపంలో ప్రతిరోజూ రూ.1.50 కోట్ల వరకు ఆదాయం లభిస్తుంది. కాగా, గురువారం ఒక్కరోజు రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో జిల్లా రిజిస్ట్రేషన్ శాఖకు సుమారు రూ.1.50 కోట్ల ఆదాయం నిలిచిపోయినట్లయింది. అయితే సర్వర్ సమస్య తమ పరిధిలోనిది కాదని, ఎప్పుడు పని చేయడం ప్రారంభిస్తుందో చెప్పలేమని, ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తామని రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు స్పష్టం చేశారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే అలైన్‌మెంట్ మార్చాల్సిందే..

ఖమ్మం ఆర్డీవో ఆఫీస్ ఎదుట రైతుల నిరసన

ఖమ్మం ఆర్డీవో ఆఫీస్ ఎదుట నిరసన తెలియజేస్తున్న రైతులు

రఘునాథపాలెం, జూలై 11: అమరావతి – నాగ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే అలైన్‌మెంట్ మార్చాల్సిందేనని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం నగరం మీదుగా హైవే నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ భూములను కోల్పోతున్న రైతులు ఖమ్మం ఆర్డీవో ఆఫీస్ వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితుల సంఘం నాయకులు బొంతు రాంబాబు, నాగళ్ల శ్రీధర్, వేములపల్లి సుధీర్ మాట్లాడుతూ.. అమరావతి – నాగ్‌పూర్ వైపే నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైతుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా బలవంతపు భూసేకరణ చేపట్టడం సరికాదని అన్నారు. నగర పరిధిలో హైవే నిర్మాణంతో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం ఉంటుందన్నారు. మందనపు రవీంద్ర, బోజెడ్ల వెంకటయ్య, నల్లమోతు శ్రీనివాసరావు, వజ్జా రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో క్రష్ సెంటర్

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 11 (నమస్తే తెలంగాణ) : మహిళా ఉద్యోగుల పిల్లల కోసం కలెక్టరేట్ సముదాయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రష్ సెంటర్‌ను వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రటరీ డాక్టర్ యోగితా రాణా గురువారం ప్రారంభించారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌తో కలిసి కేంద్రంలోని పిల్లలను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐడీవోసీలో దాదాపు 60 శాఖల కార్యాలయాలు ఇక్కడే ఉండడం.. అందులో మహిళా ఉద్యోగులు ఎక్కువగా ఉండడం వల్ల ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవడం మంచి పరిణామమన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పిల్లలు కేంద్రంలో ఉంటారని, అప్పుడప్పుడు తల్లులు కూడా వచ్చి చూసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. పిల్లల కోసం ఆట వస్తువులు, ప్రీస్కూల్ మెటీరియల్ అందుబాటులో ఉంచారని, టీచర్లు, ఆయాలు ఉండడం వల్ల పిల్లలకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి విజేత, అదనపు కలెక్టర్ విద్యాచందన, ఇంటర్మీడియట్ అధికారి సులోచన తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రష్ సెంటర్‌ను ప్రారంభించిన డాక్టర్ యోగితా రాణా, కలెక్టర్ జితేశ్

కేటీఆర్‌తో కలిసి విద్యార్థి సంఘాల నాయకులతో సమావేశమైన వద్దిరాజు

కేటీఆర్, విద్యార్థి నేతల సమావేశానికి 'వద్దిరాజు'

ఖమ్మం, జూలై 11: విద్యార్థి సంఘాల నాయకులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన సమావేశానికి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్, వద్దిరాజు మాట్లాడుతూ.. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల ప్రణాళికలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు శాంతియుతంగా ఉద్యమిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం వారిపై కర్కషంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇలాంటి తప్పుడు విధానాలను మానుకోవాలని సూచించారు.

భద్రాద్రి జిల్లా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ బదిలీ

పలు ఆరోపణలు రావడమే కారణమా?

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 11 (నమస్తే తెలంగాణ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణరావు గురువారం బదిలీ అయ్యారు. అధికారికంగా బదిలీ ఉత్తర్వులు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి రాకపోయినా కమిషనర్ నుంచి ఒక లేఖ మాత్రం బయటకు వచ్చింది. ఇది సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో మెడికల్ కాలేజీ ప్రొఫెసర్లు సైతం దీనిపై నోరు మెదపడం లేదు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన లక్ష్మణరావుపై గతంలో పలు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. కళాశాలలో చదువుతున్న విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారనే ఆరోపణల నేపథ్యంలో కాలేజీ ఎదుట విద్యార్థులు ధర్నాకు దిగారు. ఆయనపై చర్య తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. దీంతోపాటు కళాశాలకు సంబంధించిన సొమ్మును తన ఖాతాలో వేసుకున్నట్లు అభియోగం రావడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకానికి సంబంధించి వారి వద్ద నుంచి సొమ్ము వసూలు చేసిన దానిపై జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి విజేత విచారణ చేపట్టారు. ఆ నివేదికను కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌కు అందజేశారు. ఇలాంటి ఆరోపణలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నతాధికారులు ప్రిన్సిపాల్‌పై బదిలీ వేటు వేసినట్లు తెలిసింది. ఆయనను ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా బదిలీ చేసినట్లు తెలిసింది. దీనిపై మెడికల్ కాలేజీ ప్రొఫెసర్లను వివరణ కోరగా.. బదిలీకి సంబంధించి డీఎంఈ నుంచి కళాశాలకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. బయట సోషల్ మీడియాలో మాత్రం బదిలీ అయినట్లు పోస్టు వచ్చినట్లు విన్నాం. ఇంకా పూర్తి వివరాలు తెలియదని వివరించారు.

మావోయిస్టులకు దూరంగా ఉండండి..

భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

మాట్లాడుతున్న భదాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

చర్ల, జూలై 11 : 'మీకు ఎప్పుడైనా ఆపదొచ్చినా.. అవసరమొచ్చినా మావోయిస్టులు ఆదుకున్నారా? ఏమైనా సాయం అందించారా? వారికి దూరంగా ఉండండి.. మీ అభివృద్ధి బాధ్యత మేము తీసుకుంటాం.. అన్ని వేళల్లో ఆదుకునేందుకు ముందుంటాం' అని భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు ఆదివాసీలకు భరోసా ఇచ్చారు. తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు చెన్నాపురం గ్రామంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య శిబిరం ఏర్పాటు చేశామని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని, వాటి పేరుతో నమ్మి మోసపోవద్దన్నారు. మీ గ్రామాభివృద్ధికి అవసరమైన చర్యలు పోలీసులు తీసుకుంటారని, ఆరోగ్యం విషయంలో అత్యవసర సమయాల్లో మీరు లేదా, గ్రామ పటేల్ ద్వారా కబురుచేస్తే అంబులెన్స్ పంపి మీకు సహాయం అందిస్తామని ఎస్పీ తెలిపారు. భద్రాచలం నుంచి అన్ని విభాగాలకు చెందిన వైద్యులు సేవలందించేందుకు వైద్య శిబిరానికి వచ్చారని, పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ అంకిత్‌కుమార్, సీఐ రాజువర్మ, సీఆర్పీఎఫ్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

'కిన్నెరసాని'కి కొత్త నీరు

ఎగువన కురుస్తున్న వర్షాలతో వచ్చి చేరుతున్న వరద

పాల్వంచ రూరల్, జూలై 11 : ఎగువన కురుస్తున్న వర్షాలతో కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. క్రమేణా నీటిమట్టం పెరుగుతుండడంతో తొలిసారిగా గురువారం నాటికి 400.2 అడుగుల మేర నీటిమట్టం చేరింది. కిన్నెరసాని ఎగువ ప్రాంతాలైన ఇల్లెందు, టేకులపల్లి, మహబూబాబాద్ జిల్లా బయ్యారం తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగడంతో ఆ వరద నీరు వచ్చి కిన్నెరసానిలో చేరుతోంది. దీనికి పాల్వంచ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ఆ నీరు తోడు కావడంతో రిజర్వాయర్ కొత్త నీటితో కళకళలాడుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా.. ఇన్‌ఫ్లో 1,200 క్యూసెక్కులు ఉంది. ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురిస్తే వచ్చే వరద నీటిని దృష్టిలో ఉంచుకొని నీటిమట్టాన్ని 405 అడుగుల వద్ద స్థిరీకరించారు. ఈ క్రమంలో కిన్నెరసాని దిగువ ప్రాంతాల్లోని పరీవాహక ప్రాంతాల ప్రజలకు మందస్తు హెచ్చరికలు జారీ చేసి గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తారు. రిజర్వాయర్‌లోకి వచ్చి చేరే వరద నీరు 5 వేల క్యూసెక్కులు ఉంటే.. ఒక గేటు, 10 వేల క్యూసెక్కులు ఉంటే రెండు గేట్ల చొప్పున ఎత్తి నీటిని వదులుతారు. అధికారులు ప్రాజెక్టు వద్ద మందస్తుగా చేరే వరద నీటిని ఎప్పటికప్పుడు అంచనా వేసి నీటిని వదులుతుంటారు.

కొత్త నీటితో కిన్నెరసాని రిజర్వాయర్

అందరి నోటా బదిలీల మాటే..

- విద్యాసంవత్సరం ప్రారంభంతో తప్పని ఇబ్బందులు
- శాఖల్లో 40 శాతం మంది ఉద్యోగులకు ట్రాన్స్‌ఫర్లు
- ఆప్షన్లు ఇచ్చేందుకు కార్యాలయాలకు పరుగులు
- ఆరేళ్లు పూర్తయితే స్థానం ఖాళీ చేయాల్సిందే..

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 11 (నమస్తే తెలంగాణ) : కొత్త సర్కారు బదిలీలపై నిషేధం ఎత్తివేయడంతో ఉద్యోగులు ఖాళీ స్థానాల వేటలో పడ్డారు. విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో పిల్లల చదువులకు ఆటంకం కలుగుతుందేమోనని ఆలోచనలతో ఉద్యోగులు తంటాలు పడుతున్నారు. బదిలీల సమస్య ఈ విధంగా ఉంటే.. పిల్లల చదువుల కోసం ఇప్పటికే చెల్లించిన ఫీజుల సమస్య మరో విధంగా ఉంది. మరో వైపు 40 శాతం మంది ఉద్యోగులకు మాత్రమే బదిలీలకు అవకాశం ఉందని అధికారికంగా ప్రకటించడంతో సీనియర్లకు మాత్రమే స్థాన చలనం కలిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. జోన్, మల్టీ జోన్, జిల్లా క్యాడర్ పరిధులలో ఉన్న ఉద్యోగులకు ఈ నెల 22 నాటికి బదిలీల ప్రక్రియ ముగించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో అన్ని కార్యాలయాల్లో ఉద్యోగులు బిజీ అయిపోయారు. దీంతో కొద్ది రోజులుగా అన్ని శాఖల ఉద్యోగుల జాబితాను తయారు చేసేందుకు ఆయా శాఖల యూడీసీలు కసరత్తు మొదలుపెట్టారు.

విద్యా సంవత్సరం ప్రారంభంతో తప్పని ఇబ్బందులు..

ఏటా వేసవిలో కౌన్సెలింగ్‌లు పూర్తి చేసి జూన్ కల్లా బదిలీల ప్రక్రియ పూర్తి చేయడం ఆనవాయితీ. కానీ కొత్త సర్కారు.. బదిలీలపై నిషేధం ఎత్తివేసిన సందర్భాన్ని, విద్యాసంవత్సరాన్ని చూడకుండా బదిలీల ప్రక్రియను మొదలుపెట్టింది. దీంతో ఉద్యోగులు ఇరకాటంలో పడ్డారు. తమ పిల్లలు పైచదువుల్లో ఉన్న ఉద్యోగులకు కొంతమేరకు ఊరట కలిగినా.. హైస్కూల్, ప్రైమరీస్థాయి పిల్లలున్న ఉద్యోగులు మాత్రం కొన్ని ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇప్పటికే టీచర్ల బదిలీల ప్రక్రియ పూర్తి కాగా.. దాదాపు వందల పోస్టులు ఖాళీగా కనబడుతున్నాయి. దీంతో పాఠశాలల్లో టీచర్ల కొరత స్పష్టంగా కనబడుతోంది.

జిల్లాలో 12 వేలకు పైగా ఉద్యోగులు..

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు 12 వేలకు పైగా ఉన్నట్లు సమాచారం. ఇందులో కేవలం 40 శాతం మందికి మాత్రమే బదిలీలు జరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికే టీచర్ల బదిలీలు పూర్తయ్యాయి. పోలీసు శాఖలో కూడా బదిలీలు అవుతున్నాయి. ఇతర శాఖల్లో మాత్రం ఈ నెల 22 కల్లా బదిలీలు పూర్తయ్యే అవకాశం ఉంది. దీంతో ఉద్యోగులంతా ఆయా జిల్లా కార్యాలయాలకు వెళ్లి సర్వీసు రిజిస్టర్లతో పూర్తి సమాచారాన్ని ఇస్తున్నారు. ఆప్షన్ల ఫారాలను అందజేయాలని ఆదేశాలు రావడంతో ఫార్మాట్‌లో ఆప్షన్లు రాసి ఇస్తున్నారు.

ఆరేళ్లు పూర్తయితే స్థానం ఖాళీ చేయాల్సిందే..

బదిలీ అయ్యే అవకాశమున్న 40 శాతం మందిలోనూ ఒకేస్థానంలో ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు మాత్రం తప్పనిసరిగా ఆ స్థానాన్ని ఖాళీ చేయాల్సి ఉంది. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు బదిలీకి అర్హులైనప్పటికీ 'నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారు తప్పనిసరి' అనే నిబంధన పెట్టారు. ప్రస్తుతం ఉన్న ఖాళీలను దృష్టిలో ఉంచుకొని 40 శాతం మందికే బదిలీలు అయ్యే అవకాశాలు ఉన్నాయి.

బదిలీలు పారదర్శకంగా జరగాలి..

బదిలీలు పారదర్శకంగా జరగాలి. సీనియారిటీ జాబితా ఆధారంగా ప్రక్రియ జరగాలి. ఆన్‌లైన్‌లో సమస్యలు వస్తున్నాయి. పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటే ఎవరికీ ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితిని కూడా గమనించి నిర్ణయాలు తీసుకోవాలి.

–బీ.రవి, పీఆర్‌టీయూ నాయకుడు, భద్రాద్రి జిల్లా

రెండేళ్ల కోసారి బదిలీలు జరగాలి..

ప్రతీ రెండేళ్లకోసారి బదిలీలు జరిగితే ఎవరికీ ఇబ్బంది ఉండదు. ఏళ్లకేళ్లు ఒకేచోట పనిచేసిన తర్వాత వేరే ప్రాంతాలకు వెళ్లడం ఇబ్బంది అనిపిస్తుంది. ప్రభుత్వాలు మారినా నిబంధనలు మారకూడదు. ఉద్యోగ సంఘాలతో సమీక్ష చేసి వారి అభిప్రాయాలు తీసుకోవాలి. వేసవికాలంలోపే బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలి. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి కొత్త ప్రదేశాలకు వెళ్లినా ఇబ్బంది ఉండదు.

–అమర్నేని రామారావు, టీఎన్జీవోస్ నాయకుడు, భద్రాద్రి జిల్లా